క్లుప్తంగా

అభినందనలు



కుమారిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ త్రినాథ్

వీరఘట్టం: జిల్లా స్థాయి క్విజ్ పోటీల్లో రెండో స్థానంలో నిలిచిన స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల సెకెండియర్ విద్యార్థిని పి.కుమారిని ప్రిన్సిపాల్ డీజీఎస్‌వీ త్రినాథ్ బుధవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటువంటి పోటీల్లో పాల్గొంటే మనలో దాగిఉన్న ప్రతిభాపాటవాలు బయట పడతాయన్నారు.

ఎంపీడీవోగా శ్రీనివాసరావుకు అదనపు బాధ్యతలు



బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసరావు

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం ఎంపీడీవోగా ఎల్.శ్రీనివాసరావుకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉన్నతాధికారులు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఇక్కడ ఎంపీడీవోగా పని చేసిన పి.త్రివిక్రమరావుకు డ్వామా ఏపీడీగా పదోన్నతి రావటంతో వెళ్లిపోయారు. దీంతో ఆయన స్థానంలో డిప్యూటీ ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసరావుకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు విధుల్లో చేరిన శ్రీనివాసరావు మాట్లాడుతూ మండలాభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

రైతులందరికీ యూరియా

గుమ్మలక్ష్మీపురం: ఇరిడి రైతు సేవా కేంద్రం పరిధిలోని రైతులందరికీ యూరియా ఎరువును అందించడం జరుగుతుందని ఏవో పి.శంకరరావు అన్నారు. ఇరిడి గ్రామంలోని రైతు సేవా కేంద్రం వద్ద బుధవారం జరిగిన యూరియా పంపిణీ కార్యక్రమాన్ని ఆయన తహసీల్దార్ ఎస్.శేఖర్, ఎంపీడీవో ఎల్.శ్రీనివాసరావుతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ ఒక్కో రైతులకు ఒక్కో బస్తా యూరియా చొప్పున అందజేయడం జరుగుతుందని, వ్యవసాయాధికారుల సూచనల మేరకు ఎరువులను వేసుకోవాలంటూ పలు సూచనలు చేశారు. మండలానికి మొత్తం 685 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా ఇప్పటి వరకు 403 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందన్నారు. వచ్చిన యూరియాను రైతు సేవా కేంద్రాల వారీగా రైతులకు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు.

పరామర్శ..



శకుంతలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కళావతి, తదితరులు

భామిని: మండలంలోని బిల్లుమడకు చెందిన సిగడాన శకుంతలమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి బాధిత కుటుంబాన్ని బుధవారం పరామర్శించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె వెంట బిల్లుమడ సర్పంచ్ సిగడాన రాధాకృష్ణ, మాజీ సర్పంచ్ సిగడాన రాజు, వైస్ ఎంపీపీ బోనగడ్డి ధర్మారావు, పసుకుడి సర్పంచ్ భార్గవనాయుడు, రైతు సంఘ అధ్యక్షుడు కాగితాపల్లి కృష్ణారావు, తదితరులున్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



విద్యార్థుల విద్యాభివృద్ధిని పరిశీలిస్తున్న ఏటీడబ్ల్యూవో రజని

కొమరాడ: వసతిగృహ విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యే క శ్రద్ధ వహించాలని ఏటీడబ్ల్యూవో రజని అన్నారు. మండలంలోని ఎండభద్ర గిరిజన ఆశ్రమ పాఠశాలను బుధవారం ఆమె సందర్శించారు. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ మెనూ సక్రమంగా అమలవుతుందా.. లేదా.. అని అడిగి తెలుసుకున్నారు. విద్యాభివృద్ధిపై ఆరా తీశారు. పలు రికార్డులు పరిశీలించారు. ఆమె వెంట ఉపాధ్యాయులు ఉన్నారు.

మహాసభలను విజయవంతం చేయండి

పాలకొండ: త్వరలో జరగనున్న సీఐటీయూ జిల్లా మహాసభలను విజవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ నెల 13, 14 తేదీల్లో పాలకొండ పట్టణంలో జిల్లా మహాసభలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సీఐటీయూ రాష్ట్ర నాయకులు ఈ మహాసభల్లో పాల్గొని భవిష్యత్ కార్యాచరణ చేపడతారని తెలిపారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలపై తీసుకోవాల్సిన చర్యలపై చర్చించనున్నామన్నారు.

‘లంపీస్కిన్’తో ప్రాణహాని..

- సకాలంలో స్పందించాలి
- పశువైద్యాధికారి సంతోష్‌కుమార్



లంపీ స్కిన్ సోకిని పశువులు

భామిని: పాడి పశువులకు వచ్చే లంపీస్కిన్ వ్యాధి ప్రమాదకరమైన పశు వైద్యాధికారి సంతోష్‌కుమారి అన్నారు. ఇది వైరస్ వల్ల వచ్చే అంటువ్యాధని చెప్పారు. దీన్నే ముద్దచర్మ వ్యాధి అని కూడా అంటారని, సకాలంలో స్పందించి వైద్యసేవలు అందిస్తే పశువుల ప్రాణాలు కాపాడుకోవచ్చని చెప్పారు. ఈ వ్యాధి సోకితే పశువల్లో వ్యాధి నిరోధక శక్తి తగ్గిపోతుందని.. వెంటనే వైద్యసేవలు అందించాలని సూచించారు. కలుషితమైన నీరు, ఆహారం, అపరిశుభ్ర పరిసరాల వల్ల ఈ వ్యాధి సోకుతుందని చెప్పారు.

లంపీ స్కిన్ లక్షణాలు..

- ఈ వ్యాధి సోకిన పశువులు జ్వరం బారిన పడతాయి. మేత సరిగా తీసుకోవు.
- శరీరంపై గుండ్రటి గట్టిగా ఉండే మడతలేర్పడతాయి. కళ్లు, ముక్కు నుంచి నీరు కారడం, చొంగ కారడం కనిపిస్తుంది. పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గి పోతుంది. వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉండే పశువుల శరీరంపై బొడిపెలు ఏర్పడతాయి. ఇవి శరీరం అంతా వ్యాపిస్తాయి.
- ఈ బొడిపెలు క్రమంగా పెద్దగా సుమారు 1–5 సెంటీమీటర్ల పరిమాణం వరకు వ్యాపించి, నొప్పిని కలుగజేస్తాయి. ఈ మచ్చలపై పురుగులు, ఈగలు వాలడం వల్ల క్రమంగా పుండ్లుగా మారుతాయి.

ఆయుర్వేద మందుతో ప్రయోజనం..

పది తమలపాకులు, పది గ్రాముల మిరియాలు, పది గ్రాముల ఉప్పును బాగా మెత్తగా నూరాలి. ఆ తర్వాత 100 గ్రాముల బెల్లం కలిపి లడ్డూలుగా చేసుకోవాలి. ప్రతి మూడు గంటలకోసారి ఒక లడ్డూ తినిపించాలి. ఇలా వారం రోజులు ఈ మందు తినిపించాలి. లేదా రెండు వెల్లుల్లి రెబ్బలు, పది గ్రాముల ధనియాలు, పది గ్రాముల జీలకర్ర, గుప్పెడు తులసి ఆకులు, పది గ్రాముల బిర్యానీ ఆకులు, పది గ్రాముల మిరియాలు, 5 తమలపాకులు, రెండు ఉల్లిపాయలు, పది గ్రాముల పసుపు, పది గ్రాముల వాము, గుప్పెడు వేపాకులు, గుప్పెడు బిల్వపత్రాలు, పది గ్రాముల బెల్లంను మిశ్రమంగా కలిపి వారం రోజులు పెట్టాలి.

జాగ్రత్తలు పాటించాలి



పశువులపై ఈగలు, దోమలు వాలకుండా జాగ్రత్తలు పాటించాలి. పశువుల పాకను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. వ్యాధి సోకని పశువులను ఇతర పశువులకు దూరంగా ఉంచాలి. వ్యాధి నివారణ కోసం తాత్కాలికంగా గోట్ పాక్స్ వ్యాక్సిన్ ముందస్తుగా వేయించుకోవాలి. పశువుల పాకలో వేపాకు పొగ పెడితే వ్యాధి వ్యాప్తి తక్కువగా ఉంటుంది.

– సంతోష్ కుమార్, పశువైద్యుడు, చిన్నబగ్గ

పీఏసీఎస్‌లో అక్రమాలపై విచారణ



రైతుల నుంచి వివరాలను సేకరిస్తున్న డీసీవో రమణమూర్తి

గరుగుబిల్లి: గరుగుబిల్లి పీఏసీఎస్‌లో జరిగిన అవకతవకలపై రుణాలు తీసుకున్న రైతులు తమ సందేహాలను నివృత్తి చేసుకోవాలని విచారణాధికారి ఆర్.రమణమూర్తి అన్నారు. స్థానిక పీఏసీఎస్ కార్యాలయంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన రైతుల నుంచి సమాచారాన్ని తీసుకొని వారి రుణాలకు సంబంధించి సమాచారం మేరకు స్టేట్‌మెంట్‌లను బుధవారం రికార్డు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీసీసీబీ ఉన్నతాధికారులు ప్రాథమికంగా రూ.85లక్షలు అవినీతి జరిగినట్టు గుర్తించారని, ప్రస్తుతం 15మంది రైతులను విచారించగా రూ.49 లక్షల వరకు పక్కదారి పట్టినట్టు గుర్తించామన్నారు. గతంలో పని చేసిన సీఈవో గుంపస్వామి తప్పుడు రశీదులను రైతులకిచ్చి ఇటు రైతులను అటు సొసైటీని మోసం చేసి నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారన్నారు. మండలంలోని దళాయివలస, చినగుడబ, బివిపురం, వల్లరగుడబ, ఉద్దవోలు, గ్రామాలకు చెందిన రైతులకు నోటీసులు ఇచ్చామన్నారు. రైతుల రుణాలలో నిధుల దుర్వినియోగం రకరకాల పద్ధతులతో జరిగిందని, పూర్తి స్థాయిలో విచారణ చేస్తే తప్పా, నిధులు ఎంత మేర దుర్వినియోగం అయ్యాయో తెలిసే అవకాశం ఉండదన్నారు. రెండు నెలలో విచారణ పూర్తి చేసి ఉన్నతాధికారులకు నివేదిస్తానన్నారు. సొసైటీలోని సభ్యులైన రైతులంతా పీఏసీఎస్ కార్యాలయానికి వచ్చి తమ రుణానికి సంబంధించి వివరాలను తెలుసుకోవాలన్నారు.

అన్నదాతకు తప్పని యూరియా కష్టాలు



కొత్తూరులో యూరియా కోసం రైతుల తిప్పలు

గరుగుబిల్లి: కూటమి ప్రభుత్వంలో రైతులను కష్టాలు వెంటాడుతున్నాయి. ఎరువుల కొరత రోజురోజుకు తీవ్రం కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండున్నర నెలలు గడుస్తున్నా రైతులకు అవసరమైన ఎరువులను సరఫరా చేయకపోవడంతో రైతులు సర్వత్రా ఆందోళన చెందుతున్నారు. మండలంలోని 25 పంచాయతీలలో 13 వేల ఎకరాలలో వరి పంటను సాగు చేస్తున్నారు. రైతు సేవా కేంద్రాలలో, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల కార్యాలయాలలో, ప్రైవేటు దుకాణాలలో ఎక్కడైనా యూరియా దొరుకుతుందా అని రైతన్నలు వేయి కళ్లతో ఆశగా ఎదురు చూస్తున్నారు. మండలంలోని శివ్వాం ఆర్‌ఎస్‌కే పరిధిలోని కొత్తూరు ఆర్‌ఎస్‌కే ద్వారా 100 బస్తాల యూరియాను బుధవారం పంపిణీ చేయడంతో రైతులు ఉదయం నుంచే బారులు తీరారు. ఉదయం నుంచే యూరియా కోసం క్యూలో వుంటే ఇద్దరు రైతులకు ఒక్క బస్తా ఇవ్వడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అర బస్తా యూరియా గంటల కొద్ది నిరీక్షించాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎన్నడూ ఇలాంటి పరిస్థితిని ఎదుర్కొలేదని రైతులు వాపోతున్నారు.

సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలి

- భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు గౌరీశ్వరరావు



మాట్లాడుతున్న భవన నిర్మాణ కార్మికుల సంఘ జిల్లా అధ్యక్షుడు గౌరీశ్వరరావు

వీరఘట్టం: ఎన్నికల ప్రచారంలో భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చిన కూటమి నాయకులు వెంటనే నెరవేర్చాలని భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు గౌరీశ్వరరావు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 1996 భవన నిర్మాణ కార్మికచట్టం అమలు చేయాలని కోరారు. కార్మికుల పిల్లల చదువుకు రూ.20 వేలు, ఇన్సూరెన్స్ సదుపాయం, గర్భిణుల డెలివరీ ఖర్చులు ఇవ్వడంతో పాటు సహజ మరణానికి రూ. 5 లక్షలు.. ప్రమాద మరణానికి రూ. 10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లాలో సుమారు 80 వేల మంది కార్మికులు భవన నిర్మాణ రంగంపై ఆధారపడి పనిచేస్తున్నారని చెప్పారు. అలాగే స్టీల్, సిమెంట్, నిర్మాణ సామగ్రి ధరలు పెరిగిపోవడంతో నిర్మాణ రంగం కుదేలైందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం చొరవ తీసుకుని కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. ఆయనతో పాటు కార్పెంట్లు శేషగిరి, కృష్ణ ఉన్నారు.

అన్న సమారాధన..



పాలకొండ పట్టణంలోని వైఎస్సార్ వీధిలో వినాయక ఉత్సవాల్లో భాగంగా బుధవారం అన్నసమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారి ప్రసాదం స్వీకరించారని కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో నగర పాలక మండలి సభ్యులు వెలమల మన్మధరావు, కోడెం విజయ్‌కుమార్, కిల్లారి మోహనరావుతో పాటు స్థానిక నాయకులు దుంపల చిన్ని, టేకి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

– పాలకొండ రూరల్

యూరియాను అధికంగా వినియోగించొద్దు..



సంతోషపురంలో రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి రాబర్ట్‌పాల్

గరుగుబిల్లి: వరి పంటలో యూరియాను వ్యవసాయ సిబ్బంది తెలిపిన విధంగా వేయాలని, అధికంగా వినియోగించడం వల్ల పంటకు నష్టం జరుగుతుందని జిల్లా వ్యవసాయాధికారి కె.రాబర్ట్‌పాల్ అన్నారు. మండలంలోని సంతోషపురంలో ఎరువుల వినియోగంపై రైతులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూరియాను మూడు నుంచి నాలుగు విడతలలో అంటే నాటిన వెంటనే, పిలక దశలో, పొట్ట దశలో వేయాలన్నారు. యూరియాతో పాటు ద్రవ రూపంలో లభించే నానో యూరియాను వినియోగిస్తే పంటకు అవసరమైన నత్రజని లభిస్తుందన్నారు. 500ఎంఎల్ నానో యూరియా ద్రావణం 40 కిలోల యూరియా ప్రభావాన్ని చూపుతుందన్నారు. మొక్కలు కూడా నానో యూరియాను సులభంగా గ్రహిస్తాయన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అంబటి తవిటినాయుడు, ఏవో టి.జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

భూముల రీసర్వేను తక్షణం ప్రారంభించాలి



సర్వేయర్లతో మాట్లాడుతున్న జిల్లా సర్వే శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పి.లక్ష్మణరావు

గరుగుబిల్లి: మూడవ విడత భూముల రీసర్వేను గ్రామాలలో తక్షణం ప్రారంభించాలని జిల్లా సర్వే శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పి.లక్ష్మణరావు అన్నారు. మండల తహసీల్దార్ కార్యాలయంలో సర్వే సిబ్బందితో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. రీసర్వేకు సంబంధించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గరుగుబిల్లి మండలంలో పెద్దూరు పంచాయతీ శివరాంపురం, కొత్తపల్లి, గరుగుబిల్లి, తోటపల్లి, గ్రామాలలో రీసర్వేను ప్రారంభించనున్నట్లు తెలిపారు. రీసర్వేలో ప్రభుత్వ భూములను గుర్తించడంతో పాటు గ్రామ హద్దులను నిర్ణయిస్తారన్నారు. సర్వేను పారదర్శకంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో రీసర్వే డీటీ మారుతీరావు, సచివాలయ సర్వేయర్లు, తదితరులు పాల్గొన్నారు.

సన్మానం..

ఇటీవల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన కిమ్మి మోడల్ ప్రైమరీ పాఠశాల ఉపాధ్యాయుడు బి.వాసుదేవరావును ఎంఈఓ డి.గౌరినాయుడు, సహచర ఉపాధ్యాయులు బుధవారం ఘనంగా సత్కరించారు. పాఠశాల ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ.. విద్యార్థులకు సరైన గైడెన్స్ ఇస్తున్న వాసుదేవరావును ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి.సింహాచలం, బొద్దాన రామారావు, బంకురు అప్పలనాయుడు, కొండపల్లి గౌరినాయుడు, సర్పంచ్ గురాన రామ్మోహనరావు, తదితరులు పాల్గొన్నారు. – వీరఘట్టం



● గిరిజనుల అవస్థలు



మృతదేహాన్ని మోస్తూ గెడ్డను దాటుతున్న కారివలస గ్రామస్తులు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని కొండవాడ పంచాయతీ కారివలస గ్రామానికి చెందిన గిరిజనులు శ్మశాన వాటికకు వెళ్లే రహదారిలో గల గెడ్డ వద్ద కల్వర్టు లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు. ఆ గ్రామానికి చెందిన శ్మశాన వాటికకు వెళ్లాలంటే దారి మధ్యలో ప్రవహించే గెడ్డను దాటి వెళ్లాల్సిన పరిస్థితి. ఇటీవల వర్షాలు కురుస్తుండటంతో గెడ్డ ఉధృతంగా ప్రవహిస్తోంది. తప్పని పరిస్థితుల్లో మరే మార్గం లేకపోవడంతో నడుములోతు మునిగే గెడ్డ మీదుగానే మృతదేహాలను శ్మశాన వాటికకు తరలిస్తూ అగచాట్లు పడుతున్నారు. వర్షాకాలంలో గ్రామస్తులు ఎవరైనా చనిపోతే ఇదే పరిస్థితులు నెలకొంటున్నాయని, ప్రభుత్వ అధికారులు స్పందించి గెడ్డ వద్ద కల్వర్టును నిర్మించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

మౌలిక వసతుల పరిశీలన



బిల్లమానుగూడలో గిరిజన సమస్యలను తెలుసుకుంటున్న మాస్టర్ ట్రైనీ

జియ్యమ్మవలస: మండలంలోని అర్నాడ పంచాయతీ బిల్లమానుగూడ, కొత్తగూడ గిరిజన గ్రామంలో ఆది కర్మయోగి కార్యక్రమంలో భాగంగా బుధవారం గ్రామ సర్వే చేసి మౌలిక వసతులు, అవసరాలు గుర్తించారు. విలేజ్ ప్లాన్, విలేజ్ విజన్ మ్యాప్‌ను తయారు చేశారు. గ్రామస్తులు మంచినీటి సౌకర్యం, పక్కా ఇళ్లు, సిమెంట్ రోడ్డు, లింక్ రోడ్లు, పాఠశాల భవనం, వ్యవసాయ పంపుసెట్లు, త్రీఫేజ్ విద్యుత్, కమ్యూనిటీ హాల్, రచ్చబండ మొదలైన 25 అంశాలను తెలియపరిచారని మండల మాస్టర్ ట్రైనీ అల్లు రవి ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది, గిరిజనులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి దాతలు సహకరించాలి



ఉల్లిబద్రలో విరాళాలను సేకరిస్తున్న ట్రస్టు సభ్యులు

గరుగుబిల్లి: తోటపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని టీటీడీ ఆలయ అభివృద్ధి ట్రస్టు కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు. మండలంలోని ఉల్లిబద్ర గ్రామంలో విరాళాలను సేకరించేందుకు కమిటీ సభ్యులు దాతలను బుధవారం కలిశారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలువురు నుంచి రూ.18,300లు విరాళాలను సేకరించారు. అనంతరం కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఉత్తరాంధ్ర చిన తిరుపతిగా పేరుగాంచిన తోటపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయం పునః నిర్మాణం సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు దాతలు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు టి.పకీరునాయుడు, ఎం.పకీరునాయుడు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్షణికావేశంలో నిర్ణయాలు తగవు

- ప్రిన్సిపాల సుశాంత్ జనా



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సుశాంత్ జనా

సీతంపేట: క్షణికావేశంలో తీవ్రమైన నిర్ణయాలు తీసుకోవద్దని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సుశాంత్ జనా అన్నారు. విద్యార్థుల ఆత్మహత్యల నివారణపై కళాశాలలో బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ..ఏమైనా సమస్యలు ఎదురైనప్పుడు వాటి నుంచి చాకచక్యంగా బయటపడాలే తప్ప పిరికితనంతో ఆత్మహత్యలకు పాల్పడకూడదని చెప్పారు. అవసరమైతే పెద్దల సలహాలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రభాకరరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆత్మహత్యల నివారణపై అవగాహన



విద్యార్థులకు సూచనలు చేస్తున్న డిగ్రీ కళాశాల ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ కో ఆర్డినేటర్ కల్పన

గుమ్మలక్ష్మీపురం: మనో నిబ్బరం కలిగి భావోద్రేకాలను అదుపు చేసుకొని ఆత్మస్థైర్యంతో ముందుకు సాగడమే మానవ జీవిత సార్థకత అని గుమ్మలక్ష్మీపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ కోఆర్డినేటర్ వి.కల్పన అన్నారు. ప్రపంచ ఆత్మ హత్యల నివారణ దినం సందర్భంగా బుధవారం స్థానిక కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెడు ఆలోచనలు, పనుల వలన చెడు ఫలితాలు కలిగి భావోద్రేకాలను అదుపు చేసుకోలేక ఆత్మహత్యల వైపు మనస్సు మళ్లుతుందని అలాంటి ప్రమాదకర పరిస్థితులు రాకూడదనుకుంటే విద్యార్థులు స్థిరమైన లక్ష్యాలు కలిగి ఆచరణాత్మక ప్రణాళిక ఏర్పాటు చేసుకొని ధైర్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డి.రామయ్య, అధ్యాపకులు శ్రీవాణి, తులసి, సత్యారావు, చిన్నారావు, జమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సమస్యలు గుర్తించాలి



కూనేరులో ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీడీవో బృందం

కొమరాడ: కేంద్ర ప్రభుత్వం పథకం ఆదికర్మయోగి అభియాన్ కార్యక్రమంలో భాగంగా గ్రామ సభలు నిర్వహించి సమస్యలు గుర్తించాలని ఎంపీడీవో ఎస్.రమేష్ అన్నారు. చోళ్లపదం పంచాయతీ తుమ్మలవలస, కొండకూనేరు, కూనేరు తదితర గ్రామల్లో బుధవారం గ్రామసభలు నిర్వహించి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండల బృందం గుర్తించిన రోడ్లు, డ్రైన్లు, శ్మశాన వాటికలు, ఇళ్ల నిర్మాణాలు, పింఛన్లు తదితర 31 రకాల పనులను గ్రామ సభలో చదివి వినిపించమని తెలిపారు. పెండింగ్ పనులు గ్రామ సభలో చర్చించామని తెలిపారు. కార్యక్రమంలో డెప్యూటీ ఎంపీడీవో రాధాకృష్ణ, పలు శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.